క్లుప్తంగా

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



ఆలయ పనులను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

పులిచెర్ల(కల్లూరు): టీటీడీ అనుబంధంలోకి తీసుకున్న మండలంలోని మంగళంపేట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పరిశీలించారు. కొత్తగా గాలిగోపురం, గర్భగుడి, మండపాన్ని రూ.1.98కోట్లతో నిర్మిస్తున్నారు. పనులను టీటీడీ చీఫ్‌ఇంజినీర్ నాగేశ్వరరావు, ఈఈ వేణుగోపాల్, డీఈ సర్వేష, ఏఈ వెంకటేశన్, కాంట్రాక్టర్ సూరిబాబు, సర్పంచ్ మధు పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని సీఈ ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు తెలిపారు.

కాలువగట్టువీధి పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ అర్షద్‌అలి

పుంగనూరు: పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని కాలువ గట్టువీధిలో అభివృద్ధి పనులను గురువారం కౌన్సిలర్ అర్షద్‌అలి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి వార్డు పర్యటనలో వచ్చిన సమస్యలకు ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. పది రోజుల లోపు వీధులు, కాలువ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల తరపున మంత్రి, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



హరిబాబును సత్కరిస్తున్న నాయకులు

గంగవరం: మండలంలోని గుండుగల్లు సచివాలయ కార్యదర్శి హరిబాబు పెద్దపంజాణి మండలం నాగిరెడ్డిపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సచివాలయంలో గురువారం ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రమణ, వైఎస్సార్ సీపీ నేత చలపతిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు సత్కరించారు. అలాగే దండపల్లి సచివాలయం నుంచి బదిలీపై గుండుగల్లుకు వెళ్లిన మోహన్‌రామ్‌ప్రసాద్‌ని సైతం సన్మానించారు.

డ్వాక్రా గ్రూపులకు రూ.10 కోట్ల రుణాల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

పలమనేరు: మండలంలోని బేరుపల్లెలో బుధవారం సాయంత్రం డ్వాక్రా మహిళా గ్రూపులకు స్థానిక ఎస్‌బీఐ ద్వారా రూ.10 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలను సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు పరిపుష్టిగా ఉంటాయన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయ మార్గాలుగా వినియోగించుకోవాలని సూచించారు. బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ, ఏపీఎం మొగిలయ్య, సీసీ హరి, ఆత్మా చైర్మెన్ గోవిందురెడ్డి, గ్రామ సర్పంచ్ మునిస్వామి, మాధవరెడ్డి, వెలుగు సిబ్బంది మహిళా గ్రూపులు పాల్గొన్నాయి.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన కారు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు–సదుం మార్గంలోని శ్రీనివాసపురం సమీపంలో గురువారం కారు అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. సోమల మండలం నంజంపేట నుంచి కారులో రమణ, పార్వతమ్మ, శ్రీలత తిరుపతికి వెళుతున్నారు. శ్రీనివాసపురం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

పలమనేరు: పవిత్ర పర్వదినం ఈద్–ఉల్–దుహా(బక్రీద్)ను గురువారం పలమనేరు నియోజకవర్గంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో నమాజు చేశారు. పలమనేరు పట్టణం, మండలంలోని కొలమాసనపల్లె, రాజీవ్ నగర్ కాలనీ, నాగమంగళం, పకీర్‌పల్లె ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలమనేరులో అల్లాను స్మరిస్తూ ఈద్‌ఉల్ జుహాఅనే ప్రత్యేక నమాజ్‌ను చేశారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని సోదర భావాన్ని చాటుకున్నారు. బంధువులు, స్నేహితులకు ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. శక్తి మేరకు దానధర్మాలను చేశారు. మత పెద్దలు, గురువులు మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీకైన బక్రీద్ విశిష్టతను వివరించారు. హజ్ యాత్ర పరమార్థం తెలియజేశారు. కుర్బానీ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ కొంత పేదలకు, కొంత బంధుమిత్రులకు, మిగిలింది కుటుంబాలకు మూడు బాగాలుగా చేసి వండుకుంటారు కాబట్టే దీన్ని త్యాగాల పండుగ అంటారని తెలిపారు. ముస్లింలు బిరియానీ, ఫిర్నీ, మిట్టీ సేమియాలను పంచిపెట్టారు.



పలమనేరు ఈద్గాలో ప్రార్థనలు

పుంగనూరులో..

పుంగనూరు : పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లోను, ఈద్గాల వద్ద నమాజ్‌లు నిర్వహించారు. పుంగనూరు పట్టణం, పరిసర ప్రాంతాలలోని వేలాది మంది ముస్లింలు నూతన దుస్తులు ధరించి, పట్టణ సమీపంలోని ఎన్‌ఎస్.పేట ఈద్గా వద్ద, అలాగే తోపు మఠంలో మహమ్మదాలి నిర్మించిన ఈద్గా వద్ద అధిక సంఖ్యలో ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా శ్మశాన వాటికలకు వెళ్లి మృతి చెందిన కుటుంబ సభ్యులకు నివాళులర్పించారు. మహమ్మద్ ప్రవక్త సూక్తులను మత పెద్దలు వివరించారు. ముస్లింలు అల్లాహో..అక్బర్ అంటు ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా మసీదుల వద్ద, ఇండ్ల వద్ద పేదలకు నగదు, దుస్తులు, అన్నదానాలు నిర్వహించారు. హిందూ ముస్లింలు శుభాకాంక్షలు తెలుపుకుంటు విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు ఫకృద్దిన్‌షరీఫ్, అమ్ము, ఎంఎస్.సలీం, ఇనాయతుల్లా షరీఫ్, కరీముల్లా తదితరులు పర్యవేక్షించారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: బక్రీద్‌ను మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దానధర్మాలు చేశారు. ముస్లింలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, ఎంపీపీ రెడ్డెప్ప, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే వెంకటేగౌడ శుభాకాంక్షలు

బక్రీద్ సందర్భంగా పలమనేరు నియోజకవర్గ ముస్లింలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు పండుగలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

సదుం మండలంలో..

సదుం: మండలంలోని సదుం, పాలమంద, చెరుకువారిపల్లె, ఊటుపల్లె, చింతపర్తివారిపల్లెలో పండుగ సందడి నెలకొంది. మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖుర్బానీ నిర్వహించారు. పూర్వీకుల సమాధుల వద్ద దువా చేశారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు, మంగళంపేట, కొత్తపేట, కొమ్మిరెడ్డిగారిపల్లె, పులిచెర్ల ఈద్గాల వద్ద ముస్లింలు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బీదలకు దానధర్మాలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

రొంపిచెర్లలో...

రొంపిచెర్ల: మండలంలోని 12 మశీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా ఈద్గాకు తరలి వెళ్లారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత గురువు అబ్దుల్ రెహమాన్ ఉపన్యసించారు. చెడు వ్యసనాలకు బానిస కాకూడదని తెలిపారు. ఖుర్బానీ చేశారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుడన్ సాహెబ్, అల్లాబక్ష్, కరీముల్లా, గఫార్, మంజూర్, ఖాదర్‌బాషా, అబుబక్కర్, బరకత్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రామకుప్పం, బల్ల, గెర్నిపల్లెలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాలో బక్రీద్ పవిత్రతను మత గురువులు వివరించారు. ముస్లింలు ఒకొరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వి.కోట మండలంలో..

వి.కోట: మండలంలోని ఈద్గాల వద్ద ముస్లింలు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దాన ధర్మాలు చేశారు.

బైరెడ్డిపల్లె : స్థానిక మసీదు నుంచి ముస్లింలు ర్యాలీగా పురవీధుల గుండా ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని పాతపేటలో బైరెడ్డిపల్లె ఎస్‌ఐ వెంకటనరసింహులను ముస్లింలు సత్కరించారు.



రొంపిచెర్ల ఈద్గాలో ..



కల్లూరు ఈద్గాలో..



సదుం: ముస్లింల ప్రార్థనలు

శాంతిపురం మండలంలో..

శాంతిపురం: త్యాగ నిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగను మండలంలోని ముస్లింలు జరుపుకున్నారు. మసీదులలో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మత పెద్దల సందేశాలను విన్నారు. పొరుగు వారి కోసం త్యాగం, సాటి వారిపై కరుణ చూపడమే బక్రీద్ నేర్పే సుగుణమని వారు చెప్పారు. రాళ్లబూదుగూరు, కేపీమిట్ట, ఎంకేపురం, నంజంపేట, డొంకుమాకనపల్లె, సోగడబళ్ల, వెంకటేపల్లెలో మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

చౌడేపల్లె: మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతోబక్రీద్ పండుగను జరుపుకొన్నారు. చౌడేపల్లె, కోటూరు, దాదేపల్లె, ఓదులపేట, ఏ.కొత్తకోట, అంకుతోటపల్లె, కాగతి, పెద్దూరు,లద్దిగం, ఖాన్‌సాబ్‌మిట్ట తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ విశిష్టతను మత పెద్దలు బోధించారు.ఈద్ ముబాకర్ అంటు ఒకొరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



రామకుప్పంలో..



పెద్దపంజాణి : రాయలపేట ఈద్గా వద్ద ..



వి.కోట ఈద్గా వద్ద..



శాంతిపురం : కేపీమిట్టలో..

నేడు జగనన్న సురక్షపై అవగాహన

సదుం: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎర్రాతివారిపల్లె, 11.30కు చెరుకువారిపల్లె, ఒంటి గంటకు బూరగమందలో సమావేశం ఉంటుందని చెప్పారు. సమావేశాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప పాల్గొంటారని చెప్పారు.

1,2 తేదీల్లో గడపగడపకు..

పలమనేరు: పట్టణంలోని 22, 23 వార్డులో జూలై 1,2 తేదీల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారులు అభివృద్ధి నివేదికలతో రావాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

రామకుప్పం: మండల పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు రామకుప్పం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. రెండు కార్లు, ఐదు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డుతో నిర్దేశించిన ధరావతును స్టేషనులో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కుప్పం రూరల్: కుప్పం పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. కుప్పం పట్టణంలోని కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గుడుపల్లె: అటవీ ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఆరుగురిని ఎస్‌ఐ లక్ష్మీకాంత్ అదుపులో తీసుకున్నారు. గురువారం రాత్రి మండలంలోని ఓఎన్ కొత్తూరు గ్రామానికి చెందిన వారు తిమ్మమ్మచెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.22,380 స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగినంటూ మోసం

పలమనేరు: తాను మున్సిపల్ ఉద్యోగినంటూ రూ.6 వేలకు దుస్తులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా బురిడీ కొట్టించిన వైనం పట్టణంలోని పట్టణంలోని లక్ష్మీనారాయణ సిల్క్ ప్యాలెస్‌లో జరిగింది. గురువారం వెలుగు చూసిన ఈ మోసంపై సిల్క్‌ప్యాలెస్ యజమాని శివకుమార్ కథనం మేరకు.. లక్ష్మీనారాయణ సిల్క్ ప్యాలెస్‌లోకి ఖరీదైన తెల్లటి దుస్తులు ధరించిన వ్యక్తి వచ్చి తాను స్థానిక మున్సిపాలిటీలో ఉద్యోగినని, పేరు రాంబాబు అని పరిచయం చేసుకున్నాడు. తనకు రామ్‌రాజ్ బ్రాండెడ్ దుస్తులు కావాలంటూ రూ.6వేలకు కొన్నాడు. బిల్లు చెల్లించే సమయంలో తన వ్యాలెట్‌లో డబ్బులు లేవని, సిబ్బందితో ఇప్పుడే పంపిస్తానంటూ నమ్మబలికాడు. తన సెల్‌నంబరు 8099555111ను వారికిచ్చాడు. ఆయన బిల్డప్ చూసి నిజమేనని నమ్మి మళ్లీ పంపండంటూ యజమాని శివకుమార్ తెలిపారు. ఎంతసేపటికీ ఎవరూ డబ్బులు తీసుకురాకపోవడంతో ఆయన ఇచ్చిన సెల్ నంబర్‌కు ఫోన్ చేస్తే 'రాంగ్‌నెంబర్ అని.. తమది రాజమండ్రి' అనే సమాధానం వచ్చింది. దీంతో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి రాంబాబు అనే ఉద్యోగి ఉన్నాడా అని అడిగితే, అలాంటి వాళ్లెవరూ లేరనే సమాధానం వచ్చింది. దీంతో మోసపోయానని భావించిన యజమాని షాపులోని సీసీ కెమరా పుటేజీల ఆధారంగా జరిగిన మోసాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. తనలాగా ఇంకెవరూ మోసపోకూడదంటూ అందులో పేర్కొన్నాడు. జరిగిన మోసంపై పోలీసులకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదు.



సీసీ పుటేజీలో నమోదైన మోసం చేసిన వ్యక్తి చిత్రం


నాలుగేళ్లలో 40 ఏళ్ల అభివృద్ధి

బైరెడ్డిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో నాలుగేళ్లలోనే నలభై ఏళ్ల అభివృద్ధి జరిగిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బైరెడ్డిపల్లెలో నూతనంగా రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో నవశకానికి నాంది పలికారని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అంకిత భావంతో నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వబడులు, ప్రభుత్వాస్పత్రుల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు టీడీపీ అధికారంలోకి వస్తే ఉచిత పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టో రూపొందించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. 2014లో ఇచ్చిన మేనిఫెస్టో హామీలను చంద్రబాబు నెరవేర్చలేదని, తాజాగా ఆయన ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రజలు నమ్మడం లేదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి అధికారాన్ని కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నేతలు శేషగౌడు, తీర్థం కేశవులు, వెంకటరమణ, శివకుమార్, కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

వేడుకగా తొలి ఏకాదశి పూజలు



రామకుప్పంలో ప్రత్యేకాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి



గుడుపల్లె: విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు



కుప్పం: ప్రత్యేకాలంకరణలో తిమ్మరాయస్వామి

రామకుప్పం: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి, విశిష్ట అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గోవింద నామస్మరణలు మార్మోగాయి.మండలంలోని చెల్దిగానిపల్లి శ్రీరాముల మందిరంలో తొలి ఏకాదశి సందర్భంగా రామకోటి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు ఆలయాల్లో తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవళంపేటలోని శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో ఉదయం అభిషేకం అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు అర్చకులు అనంతాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

కుప్పంలో..

కుప్పం : పట్టణంలో సమీపంలోని గుత్తార్లపల్లెలో వెలిసిన శ్రీప్రసన్న తిమ్మరాయ స్వామి దేవాలయంలో గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తిమ్మరాయస్వామి, మహా గణపతి, మహాలక్ష్మి విగ్రహాలకు పంచామృత అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కుప్పం పట్టణం నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతారవణం నెలకొంది. భక్తులు పిండి దీపాలు వెలిగించారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: తొలిఏకాదశి సందర్భంగా పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గుడివంకలోని శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, శ్రీగంగాధరరేశ్వరస్వామి, ఇతర వైష్ణావాలయాల్లో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి.. భక్తులు ఉపవాసాలతో పూజలు నిర్వహించారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. వీరు గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పుంగనూరు నియోజకవర్గం:

పుంగనూరు మున్సిపాలిటీ	: జి.వరదారెడ్డి
పుంగనూరు	: కే.చెంగారెడ్డి
సదుం	: ఎన్.ప్రకాష్‌రెడ్డి
చౌడేపల్లె	: ఏ.రుక్మిణమ్మ
పులిచెర్ల	: ఎస్ఎం.బాషా
సోమల	: ఆర్.మంజునాథ్
రొంపిచెర్ల	: వె.కరీముల్లా

కుప్పం నియోజకవర్గం:

కుప్పం మున్సిపాలిటీ	: దర్బ సుధీర్
కుప్పం	: హెచ్ఎం మురుగేష్
రామకుప్పం	: వెంకటరమణరెడ్డి
శాంతిపురం	: ఎస్. బుల్లెట్ దండపాణి
గుడిపల్లె	: ఏ.రామకృష్ణ

పలమనేరు నియోజకవర్గం

పలమనేరు మున్సిపాలిటీ	: కోదండరామయ్య
పలమనేరు	: తిరుమలేష్‌నాయుడు
బైరెడ్డిపల్లె	: కార్తీక్
గంగవరం	: వినోద్‌కుమార్‌రెడ్డి
పెద్దపంజాణి	: పృథ్వీ
వి.కోట	: కే.కిషోర్‌రెడ్డి

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం



సయ్యద్‌బాషా మృతదేహం

పెద్దపంజాణి: స్నేహితులతో కలసి పెద్దవెలగటూరు క్వారీ వద్దకు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయిన పుంగనూరుకు చెందిన సయ్యద్‌బాషా మృతదేహం ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు వివరాలు.. పుంగనూరు మున్సిపల్ పరిధి నానాసాబ్ పేటకు చెందిన కరీంసాబ్ కుమారుడు సయ్యద్‌బాషా(36) స్నేహితులతో కలసి పెద్దవెలగటూరు సమీపంలోని క్వారీ గుంతలో ఈతకు వెళ్లి మంగళవారం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పుంగనూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుబ్బరాజు సిబ్బందితో కలసి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి క్వారీ గుంతలో శవాన్ని చూసిన గ్రామస్తులు పెద్దపంజాణి పోలీసులకు సమాచారం చేరవేశారు. కుటుంబ సభ్యులతో కలసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య సైదాని ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1 నుంచి గురు పూజోత్సవాలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకర్

వి.కోట: జూలై ఒకటి నుంచి మూడవ తేదీ వరకు కైవారం సద్గురు శ్రీయోగి నారాయణ మఠంలో గురుపూజ, సంగీత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సద్గురు శ్రీయోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. గురువారం పట్టణంలోని బలిజ సంఘం నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మఠంలో సద్గురు శ్రీయోగి నారాయణ తాతయ్యకు గురుపూజ, సంగీత ఉత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి వేలాదిమంది భక్తులు హాజరుకానున్నారని చెప్పారు. ఇందులో భాగంగా 72 గంటల పాటు ప్రముఖ విద్వాంసులతో సంగీత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మండల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గురుపూజోత్సవాల కరపత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాలగురునాథ్, ట్రస్టు సభ్యులు ముకుంద, మూర్తి, అమరనాథ్, సతీష్, నాని, రెడ్డిభాస్కర్, మురళి పాల్గొన్నారు.